క్లుప్తంగా

రైతు బజారు ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాటా 27, వంకాయ 28, బెండ 28, పచ్చి మిర్చి 50, కాకర 40, బీర 40, క్యాబేజీ 15, ఫ్రెంచిబీన్స్ 55–85, క్యారెట్ 37, దొండ 18–23, చిక్కుడు 55, గోకర 35, బీట్‌రూట్ 23, క్యాప్సికం 65, ఆలు 20, దోస 15, సొర 15, పొట్ల 15, ఉల్లి 14, చామగడ్డ 33. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

వైశ్య ఫెడరేషన్ యూత్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా లోకేష్



నియామక పత్రం అందజేస్తున్న శ్రీనివాస్ గుప్తా

లింగోజిగూడ: ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షుడిగా కొప్పు రావూరి లోకేష్ నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్తా తన నివాసంలో లోకేష్‌కు నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజినీకాంత్, చిరుమామిళ్ల హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో హేమేశ్వరికి గోల్డ్ మెడల్

సాక్షి, సిటీబ్యూరో: రెండో జాతీయ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటారు. ఇండియన్ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్, తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో తెలంగాణకు చెందిన హేమేశ్వరిదేవి స్వర్ణపతకం సాధించింది. 70 కేజీల బంగారం విభాగంలో హేమేశ్వరిదేవి 90 కేజీలు ఎత్తి మొదటి స్థానంలో నిలిచింది. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన 170 మంది వెయిట్ లిఫ్టర్లు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు ఇండియన్ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ చీఫ్ వీణాశెట్టి, తెలంగాణ మాస్టర్స్ వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రెటరీ శృతిరావు, ప్రెసిడెంట్ పీవీఆర్ నాయుడు, చీఫ్ ప్యాట్రన్ ప్రదీప్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు, కృష్ణబాబులకు మెడల్స్‌ను అందజేశారు.

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

కాచిగూడ: పద్మశాలీలు ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో రాణించాలని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ పిలుపునిచ్చారు. చదువుకు వయసుతో నిమిత్తంలేదని, ఎవరైన చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని దీనికి నిదర్శనం పుట్ట పాండురంగయ్య అన్నారు. ఇంజినీర్‌గా పదవీవిరమణ పొంది చదువుపై ఉన్న శ్రద్ధతో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీలో డాక్టరేట్ డిగ్రీ పట్టాను అందుకోవడం గర్వకారణమన్నారు. అఖిల భారత పద్మశాలీ ఇంజినీర్స్ విభాగ్ సంఘం ఆధ్వర్యంలో నారాయణగూడ పద్మశాలి భవన్‌లో మంగళవారం ఓయూ నుంచి పీహెచ్‌డీలో డాక్టరేట్ అందుకున్న సందర్భంగా పుట్ట పాండురంగయ్యకు అభినందన సత్కార సభ జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ మేయర్ సుధారాణి, అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు తదితరులున్నారు.

నేడు విగ్రహాల ప్రతిష్ఠ

రామంతాపూర్: చిన్న చెరువు సమీపంలోని శ్రీగంగా లక్ష్మీ భవాని అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో స్థానిక గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే విజయ గణపతి, శివలింగం, నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గంగపుత్ర సంఘం అధ్యక్షులు ధీటి మల్లయ్య, ఆలయ అధ్యక్షులు పూస సత్తయ్య తెలిపారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవానికి మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు బేతి సుభాష్‌రెడ్డి, ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, కార్పొరేటర్లు హాజరవుతారని తెలిపారు.

భార్యపై దాడి చేసిన వ్యక్తికి జైలు

డబీర్‌పురా: భార్యపై దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 21 రోజుల జైలు శిక్ష విధిస్తూ మంగళవారం నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు తీర్పు చెప్పారు. డబీర్‌పురా పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో సమీరా ఫాతిమా, మహ్మద్ ఖలీమ్ దంపతులు నివాసం ఉంటున్నారు. గత కొన్నాళ్లుగా మహ్మద్ ఖలీం భార్య సమీరా ఫాతిమాతో అనవసరంగా గొడవపడుతూ ఆమెపై దాడికి పాల్పడ్డాడు. దీనిపై సమీరా ఫాతిమా డబీర్‌పురా పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఖలీమ్‌ను అరెస్ట్ చేసి మంగళవారం కోర్టులో హాజరు పరిచారు. విచారణ చేపట్టిన నాంపల్లిలోని 6వ స్పెషల్ మెట్రో పాలిటన్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లక్ష్మణ్ రావు నిందితుడు మహ్మద్ ఖలీంకు 21 రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

తెలంగాణలో సంక్షేమాల స్వర్ణయుగం

మంత్రి సబితారెడ్డి



ఖిల్లా మైసమ్మ ఆలయాన్ని సందర్శించిన విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణలో సంక్షేమాల స్వర్ణయుగం నడుస్తోందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని పురాతన ఖిల్లామైసమ్మ ఆలయాభివృద్ధికి కోటి రూపాయులు కేటాయించిన సందర్భంగా మంగళవారం ఆమె ఆలయాన్ని పరిశీలించారు. చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు, నాయకులతో చర్చించారు. మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అందిస్తూ ఆధ్యాత్మికతకు పెద్దపీట వేస్తున్నారని, తాము హిందువులమని గొంతు చించుకొని అరిచేవాళ్లు ఆలయాల అభివృద్ధికి ఒక రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం పునర్నిర్మాణం కేసీఆర్‌కే సాధ్యమైందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో పురాతన ఆలయాల అభివృద్ధికి అడిగిన వెంటనే రూ.5 కోట్ల నిధులు మంజూరు చేసిన సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆయాచితం శ్రీధర్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్తా, పార్టీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శులు బేర బాలకిషన్, మురుకుంట్ల అరవింద్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, పటేల్ సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



ఎమ్మెల్యే బలాలకు సమస్యను వివరిస్తున్న ఏఈ చంద్రునాయక్

మలక్‌పేట: మూసారంబాగ్‌లో నడుస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అధికారులను ఆదేశించారు. మంగళవారం వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి డివిజన్ పరిధిలోని సాయినగర్, బాడా బజార్, ఇందిరనగర్ ప్రాంతాల్లో పర్యటించారు. బాడా బజార్‌లో నాలా నిర్మాణ పనులు, వాటర్ పైప్‌లైన్ సమస్య నెలకొన్న ప్రాంతాన్ని పరిశీలించారు. సమస్యకు సత్వరమే పరిష్కారం మార్గం చూపాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం దగ్గర పడుతున్నందువల్ల నాలా నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సమస్యలను పరిష్కారించాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని వారిని హెచ్చరించారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మలక్‌పేట ఏరియా డీజీఎం శీలారాణి, మూసారంబాగ్ ఏఈ చంద్రునాయక్, కాలనీవాసులు, మజ్లిస్ పార్టీ నాయకులు ఉన్నారు.

కలుషిత నీటి సరఫరా అరికట్టేందుకు చర్యలు



సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: కలుషిత నీటి సరఫరా అరికట్టడానికి తగిన చర్యలు తీసుకుంటున్నట్టు మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్‌లో పర్యటించి బడాబజార్‌లో కొనసాగుతున్న వాటర్ వర్క్స్ పైప్‌లైన్ పనులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొత్త పైప్‌లైన్ నిర్మాణంతో ఎంతో కాలంగా కాలనీవాసులు ఎదుర్కొంటున్న కలుషిత నీటి సరఫరా సమస్యకు ముగింపు పడిందన్నారు. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపర్చడానికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. సమస్యల పరిష్కారమే పరమావధిగా పని చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌వర్క్స్ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, నాయకులు సురేందర్, సాధిక్, దిలీప్, ఉదయ్, సంతోష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

వనస్థలిపురం: శ్రీ లక్ష్మీగణపతి ఆలయ సముదాయంలోని వనస్థలి శబరిమల అయ్యప్ప దేవస్థానం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా ఇరగవరపు రత్నమాల, అధ్యక్షుడిగా గూడూరు సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పున్న ఓంకారం, కోశాధికారిగా కొమ్మిడి కృష్ణారెడ్డి, సలహాదారుగా ఎం.భాస్కరరావు, ఉపాధ్యక్షుడిగా ఈ.కృష్ణారావు, సహాయ కార్యదర్శిగా పి.సాయి రుషికేష్ ను ఎంపిక చేశారు. అలాగే, కార్యవర్గ సభ్యుడిగా ఎం.విఠల్ యాదవ్, గుండం సత్యనారాయణ, జి.దాస్‌గౌడ్, బి.అరవింద్‌గౌడ్, వి.ఆనంద రావు, ఎస్.గోవర్ధన్‌రావు, ఎం.ప్రేమ్‌రాజ్, జె.శ్రీకాంత్ జాదవ్ ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం రెండేళ్లపాటు కొనసాగుతుందని అధ్యక్షుడు సంజీవరెడ్డి తెలిపారు.

ఘనంగా దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి


ఎల్‌బీనగర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఎల్‌బీనగర్‌లో అన్ని శాఖల అధికారులతో సమావేశమై దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి ప్రజలకు తెలిసే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేశామన్నారు. వృద్ధులకు, వితంతులకు, దివ్యాంగులకు పింఛన్లు అందించామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌తో పాటు సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతున్నదన్నారు. పండుగను తలపించేలా ఉత్సవాలు ఉండాలని, అన్ని శాఖల అధికారులు ఆ దిశగా కృషి చేయాలని కోరారు.

బీసీల పక్షపాతి సీఎం కేసీఆర్

కాచిగూడ: సీఎం కేసీఆర్ అన్ని కులాలకు సమ ప్రాధాన్యం ఇస్తున్నారని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి అన్నారు. జాతీయ బీసీదళ్ నగర అధ్యక్షుడు బాల రాజేష్ యాదవ్ అధ్యక్షతన బీసీ ప్రతినిధుల సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఇప్పటికే ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని ప్రస్తుతం అన్ని వృత్తి కులాలకు రూ.లక్ష ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. బీసీలపై సీఎం కేసీఆర్ చూపుతున్న ప్రత్యేక శ్రద్ధకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన వృత్తికులాల వారికి కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఆర్థిక చేయూత అందించడానికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఉన్నతమైందని కొనియాడారు. రాజేష్‌యాదవ్, రమణ, బాలకృష్ణయాదవ్, సత్యనారాయణ, ఈసప్ప, నారాయణరాజు, నాగేంద్రప్ప, లక్ష్మణ్‌రావు, సాంబమూర్తి, పోలయ్య, బ్రహ్మం, శ్రీరంగం, రంగనాయకులు, రామసుబ్బయ్య, బాలకృష్ణ తదితరులున్నారు.

శ్మశానవాటికను అభివృద్ధి చేయకుంటే ఆందోళన

మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్



ధోబీఘాట్ శ్మశాన వాటికను పరిశీలిస్తున్న సహదేవ్‌యాదవ్

సైదాబాద్: పాతబస్తీలోనే అతిపెద్ద శ్మశానవాటికల్లో ఒకటైన సైదాబాద్ ధోబీఘాట్ శ్మశానవాటికను అభివృద్ధి పర్చడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కుర్మగూడ డివిజన్ బీజేపీ మాజీ కార్పొరేటర్ కె.సహదేవ్‌యాదవ్ మండిపడ్డారు. ఈ శ్మశాన వాటికను అభివృద్ధి చేయకుండే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని జీహెచ్‌ఎంసీ అధికారులను హెచ్చరించారు. మంగళవారం ఆయన బీజేపీ నాయకులతో కలిసి ధోబీఘాట్‌లోని హిందూ శ్మశాన వాటికను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఎనిమిదేళ్ల క్రితం సాక్షాత్తు ముఖ్యమంత్రి సందర్శించి అభివృద్ధికి హామీ ఇచ్చినా ధోబీఘాట్ శ్మశానవాటిక పరిస్థితిలో మార్పు రాకపోవడం సిగ్గు చేటన్నారు. శ్మశాన వాటికకు చెందిన కుంటను కూడా వ్యర్థాలతో మూసివేశారన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చెత్త, వ్యర్థాలను తెచ్చి ఇక్కడ వేస్తుండటంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశాన వాటిక అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని సహదేవ్‌యాదవ్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలకృష్ణ, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

కళలు, కళాకారులను ప్రోత్సహించాలి

సైదాబాద్: కళలు, కళాకారులను ప్రోత్సహిస్తే మన సంస్కృతీ సంప్రదాయాలు అందరికీ చేరువౌతాయని వైఎస్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సెంట్రల్ చైర్మన్ వైఎస్‌ఆర్ మూర్తి అన్నారు. మంగళవారం ఆయన సైదాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతూ, నగరంలోని కళాకారిణులను ప్రోత్సహించడానికి, వారిలోని ప్రతిభను వెలికి తీసుకొచ్చేందుకు తమ సంస్థ కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగా వైఎస్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సెంట్రల్, వైఎస్‌ఆర్ మూర్తి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జూన్ 11న బషీర్‌బాగ్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. కవితలు, పాటలలో ప్రావీణ్యం ఉన్న యువతులు కార్యక్రమంలో పాల్గొనాలని, ప్రతిభ కనబరిచిన వారికి సంస్థ తరపున సత్కరిస్తామన్నారు. ఆసక్తి ఉన్న కళాకారిణులు మరిన్ని వివరాలకు, తమ పేర్లు నమోదుకు ఫోన్ నం. 9849569626లో సంప్రదించాలని ఆయన కోరారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఆలయ ట్రస్టీలు

చాదర్‌ఘాట్: మలక్‌పేట మున్సిపల్ కాలనీలోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో మంగళవారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ ఉమారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ట్రస్టీలు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, పీటీ శంకర్ ముదిరాజ్, చేగిరెడ్డి మదన్మోహన్‌రెడ్డి, మాధవరావు, రామకృష్ణ, సురేష్, ప్రభు, ప్రసాద్, ఈఓ జోషి మార్తాండరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



సాయిరాం కృష్ణ

హస్తినాపురం: ఇంటి నుంచి బయటికి వెళ్లిన మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌జీవోస్ కాలనీలో నివాసం ఉంటున్న పేరూరి సాయిరాం కృష్ణ (57)కొంత కాలంగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్నాడు. ఈనెల 26న ఉదయం మార్నింగ్ వాకింగ్‌కు వెళ్తున్నానని ఇంట్లో వారికి చెప్పి బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు సాయిరాంకృష్ణ కోసం స్థానికంగా గాలించడంతో పాటు బంధు,మిత్రులను వాకబు చేశారు. ఆచూకీ తెలియకపోవడంతో అతడి సోదరుడు సత్యనారాయణ వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

యాకుత్‌పురా: ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి వాటి పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్ అన్నారు. మంగళవారం ఆయన డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... తమ పార్టీ అధినేత ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి ప్రజ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నాలా, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలించి వేగంగా పూర్తి చేయాలని అధికారులను కోరమన్నారు. వర్షాకాలంలో వరద నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, ఏరియా కమిటీ అధ్యక్షులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులు పాల్గొన్నారు.



నాగోలులో మినీ స్టేడియం ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు

లింగోజిగూడ: నాగోలు పరిసర ప్రాంతాల్లో మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని నాగోలు డివిజన్‌లోని 30 కాలనీల సంక్షేమ సంఘాలు కోరాయి. ఈ మేరకు మంగళవారం కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీల వాసులు మాట్లాడుతూ, యువత ఆడుకొనేందుకు సరూర్‌నగర్ స్టేడియం లేదా ఓయూకు వెళ్లాల్సి వస్తోందని, స్థానికంగానే ఒక స్టేడియం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. శ్మశాన వాటిక పక్కన ఉన్న స్థలంలో స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు తుర్పాటి చిరంజీవి, నాయకులు అనంతుల రాజిరెడ్డి, కాలనీల వాసులు శ్యామల యాదగిరి, మురళీమోహన్, విజయసింహారెడ్డి, సూరజ్, వెంకట్, పంపత్‌కుమార్, శ్రీనివాస్, వరకుమార్, వెంకటేశ్వరరావు, మల్లారెడ్డి, పురుషోత్తంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పెద్దచెరువు నుంచి దుర్వాసన రాకుండా చర్యలు



పెద్దచెరువులో డ్రోన్ సాయంతో రసాయనాలు పిచికారీ చేయిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: పెద్దచెరువు నీటి నుంచి దుర్వాసన రాకుండా చర్యలు చేపట్టి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పిస్తామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. పెద్దచెరువులో పేరుకపోయిన గుర్రపు డెక్కను మంగళవారం తొలగింపజేసి మురుగునీరు దుర్వాసన రాకుండా డ్రోన్ సాయంతో రసాయనాలను పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, పెద్దచెరువు సుందరీకరణ పనులు జరుగుతున్నాయని, చెరువు ప్రాంగణాన్ని తరచూ సందర్శించి వాకర్స్‌కు, సమీప కాలనీలవాసులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని చెరువు ప్రాంగణంలోని షెడ్డులో ఘనంగా జరుపుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, ఎంటమాలజీ ఏఈ రవీంద్రనాథ్, ఎస్‌ఎఫ్‌ఏ జనార్ధన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక ఐక్యతను చాటిచెబుదాం



క్రీడా ప్రాంగణంలో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న కీసరి నర్సిరెడ్డి

సీఐటీయూ నేత నర్సిరెడ్డి

మన్సూరాబాద్: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ కార్మిక వర్గ ఐక్యతను చాటిచెబుతామని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. సీఐటీయూ 73వ ఆవిర్భావ వేడుకలను మన్సూరాబాద్ డివిజన్ పరిధి మెట్ట వ్యవసాయ పరిశోధన కేంద్రం (క్రీడా)లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను ఆవిష్కరించిన నర్సిరెడ్డి కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నదన్నారు. కులాలు, మతాల పేరు సమాజాన్ని చీల్చేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ కార్మికులను బానిసలుగా మారుస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, రావుల రాజు, బాలరాజు, దర్శన్, బాలయ్య, తులాల్‌రెడ్డి, సత్తయ్య, ఎల్లమ్మ, రమాదేవి, సుకన్య, లింగమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సోయం బాపురావుపై చర్యలు తీసుకోవాలి

కాచిగూడ: క్రిస్టియన్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ సోయం బాపురావుపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) జాతీయ అధ్యక్షుడు విజయరాజు, తెలంగాణ రాష్ట్ర కో– ఆర్డినేటర్ ఏకే గిడియోనుబాబు, యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇసాక్‌పాల్ డిమాండ్ చేశారు. మంగళవారం నారాయణగూడలో వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో 'ఎంపీ సోయం బాపురావు క్రిస్టియన్లపై బుల్లెట్లు దించుతామని హెచ్చరిస్తూ.. ప్రసంగించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు'. మతం వ్యక్తిగత అభిప్రాయమని ఈ విషయంలో ఎంపీ జోక్యం చేసుకుంటూ.. క్రిస్టియన్ల పట్ల అవమానకరంగా మాట్లాడటాన్ని వారు తప్పుబట్టారు. ఈ విషయంపై పార్లమెంట్ స్పీకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఆయన క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో రాష్ట్ర, దేశవ్యాప్తంగా బాపురావుకు వ్యతిరేకంగా నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలి



ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీఐ భాస్కర్‌రెడ్డిలకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న మైత్రీ కమిటీ సభ్యులు

మలక్‌పేట: శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ కసపరాజు శ్రీనివాస్ అన్నారు. గడ్డిఅన్నారం ఉమా మహేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ లింగాల బస్వరాజ్‌గౌడ్, మలక్‌పేట మైత్రీ కమిటీ చైర్మన్ లింగాల శ్రీనివాస్‌గౌడ్‌తో కూడిన బృందం మలక్‌పేట ఠాణాలో ఇన్‌స్పెక్టర్‌ను, డీఐ లెంకల భాస్కర్‌రెడ్డి, డీఎస్సై సాయితేజారెడ్డిలను సన్మానించింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలు ప్రశాంతంగా పండుగలు జరుపుకునేలా చేయడంలో కాలనీ సంక్షేమ సంఘాలు, మైత్రీ, పీఎస్ కమిటీ సభ్యుల సహకారం ఎంతో ఉంటుందన్నారు. వచ్చే నెలల్లో జరగనున్న బోనాల పండుగ, బక్రీద్, గణేష్ ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవడానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డి, అనిల్‌చారి, ఉమేష్‌జోషి, భరత్‌రెడ్డి, రవికుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఏ నిమిషానికి.. ఏమి జరుగునో!

ప్రశాంతిహిల్స్‌లో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. తీగలు తెగిపడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళనలో ఉన్నారు. వివరాల్లోకి వెళ్తే.. కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంతిహిల్స్ రోడ్ నం.8లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. దాదాపు 30 ఏళ్ల క్రితం వేసిన విద్యుత్ లైన్ కావడం...ఆ తర్వాత మార్చకపోవడంతో పలుమార్లు తీగలు తెగిపడిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు తెలిపారు. తీగలు తెగిపిన ప్పుడల్లా విద్యుత్ శాఖ అధికారులు రావడం తాత్కాలికంగా జాయింట్లు బిగిస్తున్నారు తప్ప వైర్లు మార్చడం లేదని కాలనీవాసులు పేర్కొన్నారు. ఒక్కో వైరుకు మూడు నుంచి నాలుగు జాయింట్లు ఉన్నాయని.. ఎప్పుడు ఏ వైర్ తెగి ప్రమాదం సంభవిస్తుందోనని భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వైర్లు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.